క్లుప్తంగా

ఆధునిక సాంకేతికతతో అధిక ఉత్పత్తులు



ఆక్వా ఎక్స్ ఇండియా నిర్వాహకులను అభినందిస్తున్న రామరాజు

కాళ్ల: ఆక్వా రైతులు ఆధునిక సాంకేతికతతో అధిక ఉత్పత్తులు సాధించాలని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఆక్వా ఎక్స్‌పో ఇండియా రెండో రోజు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రెండో రోజు ఈ ఎక్స్‌పో లో ఏర్పాటు చేసిన 80 స్టాల్స్ లో పలువురు రైతులు, మత్స్యశాఖ విద్యార్థులు పాల్గొని ఆక్వా సాగుపై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు సాగులో మెలకువలను పాటించి సాగు చేయాలని సూచించారు.

క్రీడాకారిణి ఎంపిక



తోలేరు పాఠశాల క్రీడాకారిణి వేంద్ర రమ్యశ్రీ

వీరవాసరం: భీమవరం బ్రౌనింగ్ కాలేజీలో జరిగిన అండర్ 19 నెట్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోలేరు క్రీడాకారిణి వేంద్ర రమ్యశ్రీ ఎంపికై నట్లు, రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి కిషోర్ కుమార్ శుక్రవారం తెలియజేశారు. నెట్‌బాల్ అండర్-19రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు సెలెక్ట్ అయిన వేంద్ర రమ్యశ్రీని, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పూడి శ్రీనివాసుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. కిషోర్ కుమార్, గ్రామ సర్పంచ్ వేంద్ర లీలా వెంకటకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ భోగిరెడ్డి శ్రీను, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముత్యాల పద్మ, గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నానో యూరియాపై అవగాహన



మానవహారం నిర్వహిస్తున్న ఏవో రమేష్ నాయుడు

కాళ్ల: నానో యూరియాను పంట ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కల పత్రహరితానికి నేరుగా చేరుతుందని కాళ్ల మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు తెలిపారు. మండలంలోని కోపల్లె గ్రామంలో నానో యూరియాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 కిలోల బస్తాలో ఉండే పోషకాలు అరలీటర్ నానో యూరియాలో ఉంటాయన్నారు. నానో యూరియా 30 నానో మైక్రాన్‌ల ఘనపరిమాణం ఉంటుందని, 80 శాతానికి పైగా మొక్కకు చేరుతుందన్నారు. దీని ద్వారా ఎరువు వృథా కాలుష్యం తగ్గుతుందన్నారు. ఒక ఎకరానికి 500 ఎంఎల్ చొప్పున (ఒక బాటిల్) పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం యూరియాపై అవగాహన కల్పిస్తూ రైతులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కోపల్లె సొసైటీ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



సాయిబాబును సన్మానిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని వేంద్ర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పంపన సాయిబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకోవడంతో శుక్రవారం పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో నాయకులు, అధికారులు ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ అధ్యక్షుడు భూపతి రాజు సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ వి.రెడ్డియ్య, ఎంఈఓ పీపీ వెంకట శివ నాగరాజు ఆధ్వర్యంలో సాయిబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబు సేవలను కొనియాడారు.

సామూహిక ఎలుకల నిర్మూలన వాయిదా

ఉండి: మండల వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించాల్సిన సామూహిక ఎలుకల నిర్మూలన, బ్రోమోడయోలిన్ ఉచిత మందు కార్యక్రమాన్ని ఉదయం కురిసిన వర్షం కారణంగా వాయిదా వేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు చేపట్టేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

మురుగు డ్రెయిన్‌గా ఎల్‌జీ పాడు పంట కాలువ

- ఆక్వా చెరువుల్లో మురుగునీరు పంటకాలువల్లోకి తోడుతున్న వైనం
- ఆ నీటినే తాగాల్సి వస్తుందని శివారు ప్రాంత గ్రామస్తుల ఆవేదన
- పట్టించుకోని ఇరిగేషన్, నీటి సంఘాలు



గొల్లవానితిప్ప గొంది వద్ద పంటకాలువలోకి మురుగునీరు తోడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని ఎల్‌జీ పాడు పంటకాల్వ పరివాహక రైతులు రొయ్యలు, చేపలు చెరువులలోని మురుగునీటిని ఎల్‌జీ పాడు ఛానల్ లోకి వదులుతున్నారు. దీంతో ఈ నీటిని తాగి శివారు ప్రాంత గ్రామస్తులు తరచూ అనారోగ్యం పాలవుతున్నా ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, గొంది, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి, దొంగపిండి గ్రామాలు మీదుగా ఎల్‌జీపాడు పంటకాల్వ ఉంది. దీనిని ఆనుకుని సుమారు 7 వేల ఎకరాలకు సాగు, సుమారు 22 వేల మంది జనాభాకు తాగునీరందుతుంది. ఈ పంటకాల్వను ఆనుకుని సాగు చేస్తున్న కొంతమంది రైతులకు తమ చేపలు, రొయ్యల చెరువులకు మురుగు నీరు పోయేందుకు డ్రెయిన్‌లు లేకపోవడంతో చెరువుల్లోని క్రిమిసంహారక మందులు, రసాయనాలు వాడిన మురుగు నీటిని పంటకాల్వలోకి తోడుతున్నారు. దీంతో దిగువనున్న గ్రామస్తులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

పంట కాలువల్లోకి మురుగునీరు

గొంది, గూట్లపాడు, కొత్తపూసలమర్రు గ్రామాల్లో పంటకాలువను ఆనుకుని చేపలు, రొయ్యలు చెరువులు చేస్తున్న కొంతమంది రైతులకు మురుగు డ్రెయిన్‌లు లేకపోవడంతో నేరుగా తమ చెరువుల నుంచి కలుషిత నీటిని పంటకాలువల్లోకి తూములు, ఆయిల్ ఇంజన్లు ద్వారా వదులుతున్నారు. దీంతో కలుషితమైన నీటిని దిగువ గ్రామాలైన కొత్తపూసలమర్రు, లోసరి, దొంగపిండి గ్రామాల రక్షిత మంచినీటి చెరువుల్లో నింపి గ్రామస్తులకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని తాగి డయేరియా, జలుబు, వైరల్ జ్వరాలు, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని దిగువ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

పంటకాలువ పరివాహక చెరువులకు అనధికార తూములు పెట్టి మురుగునీటిని వదిలేస్తున్నా ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల సభ్యులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంటకాలువలకు ఉన్న అనధికార మురుగునీరు వదిలే తూములను తీసివేసి సమస్యను పరిష్కరించాలని దిగువ గ్రామస్తులు కోరుకుంటున్నారు.

తరచూ అనారోగ్యం పాలవుతున్నాం

“ పంటకాల్లోకి మురుగునీరు వదులుతున్నారు. ఈ నీటిని తాగి తరచూ అనారోగ్యానికి గురై ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నాం. ఫిల్టర్ బెడ్లు పనిచేయకపోవడంతో కుళాయిల ద్వారా వచ్చే నీటినే తాగుతున్నాం.

– ఆర్ బాలకృష్ణ, గ్రామస్తుడు, దొంగపిండి

అధికారులు పట్టించుకోవాలి

పంటకాలువలో మురుగునీటిని వదిలే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. పంట కాలువలు పరివాహక ప్రాంతంలో ఉన్న అనధికార తూములను తొలగించి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– ఎన్. వెంకటరాజు, గ్రామస్తుడు, దొంగపిండి

మానవత సేవలు అభినందనీయం



భీమవరంలో మానవతాసంస్థ ఆధ్వర్యంలో నిత్యావ సరసరుకులు పంపిణీ దృశ్యం

భీమవరం: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమవరం మానవతా సంస్థ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి శుక్రవారం నిత్యావసర సరుకులు అందచేశారు. భీమవరం పట్టణం తాడేరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవరపల్లి వెంకటరమణ, తిరుమల శెట్టి వెంకటనరసమ్మ దీర్ఘకాలిక వ్యాధులతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలియడంతో మానవతా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు ఆర్థిక సహాయంతో నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వర వరప్రసాద్, ఇందుకూరి శివాజీవర్మ, అల్లు శ్రీనివాస్, చాన్ భాషా, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విష్ణు కళాశాల విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతి



జాతీయస్థాయి ఇన్నోవేషన్ పోటీల్లో బహుమతి అందుకుంటున్న విష్ణు కళాశాల విద్యార్థులు

భీమవరం: ప్రతిష్టాత్మక జాతీయస్థాయి ఇన్నోవేషన్ ×బ్రెయిన్ బోల్ట్-ది ఇంజినీర్స్ స్ప్రింట్ పోటీల్లో భీమవరం విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తృతీయ సంవత్సరం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు శుక్రవారం విలేకర్లకు చెప్పారు. ఈనెల 11వ తేదిన హైదరాబాద్‌లో ఏఎస్ఎంఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ఎం మధు, ఎం హరీష్, ఎన్ డేవిడ్‌రాజు, ఎల్ హరి దత్తగణేశ్‌వర్మ, ఎం అభిలాష్ బృందం బహుమతి గెలుచుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా 300 జట్లు పోటీపడగా కేవలం 49 జట్లు మాత్రమే ఫైనల్ రౌండ్‌కి అర్హత సాధించారని, వాటిలో తమ విద్యార్థులు ద్వితీయస్థానంతో రూ. లక్ష బహుమతి, ట్రోఫీని గెల్చుకున్నారన్నారు. బహుమతి సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్ నాగకృష్ణ అభినందించారు.

అబ్బిరాజుపాలెం రేవు వేలం పాట ఖరారు



అబ్బిరాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రేవు పాట

యలమంచిలి: మండలంలోని అబ్బిరాజుపాలెం వద్ద వశిష్ట గోదావరి నదిలో పంటు తిప్పేందుకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో రేవు పాట నిర్వహించగా గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణ రూ.3.47 లక్షలకు పాట దక్కించుకున్నారు. సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీఓ జక్కంశెట్టి దేవార్క్ వెంకట ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్ రేవు పాట నిర్వహించారు. అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణతోపాటు ఏనుగువానిలంక గ్రామానికి చెందిన వినుకొండ లక్ష్మీ రూ.25 వేలు ధరావతు చెల్లించి వేలంలోపాల్గొన్నారు. 30జూన్ 2026వరకు పాట కాలానికి గానూ, లైసెన్స్‌ఉన్న పంటు మాత్రమే తిప్పాలనే నిబంధనతో రేవు పాట నిర్వహించారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం



ఉండి బీసీ బాలుర హాస్టల్‌ని పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ సునంద

ఉండి: మన పరిసరాల పరిశుభ్రతే మన ఆరోగ్యానికి మూలమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ పి.సునంద అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండి బీసీ బాలుర హాస్టల్‌ను వైద్య బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ సునంద మాట్లాడుతూ డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఉండి బీసీ బాలుర హాస్టల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. హాస్టల్ అంతా పరిశుభ్రంగా ఉందని గదులన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కానీ వాడకం నీరు నిలిచి ఉందని దాని ద్వారా దోమల వ్యాప్తి జరిగే అవకాశం ఉందని హాస్టల్ సిబ్బందికి సూచించారు. వెంటనే నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏ ప్రాంతంలో అయినా నీరు నిలువ ఉంటే దాని వల్ల ఇబ్బందులు కలుగుతాయని నీరు నిలువ లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంచి వైద్య సదుపాయాలు ఉన్నాయని వాటని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ సుందన తెలిపారు.

విద్యార్థులంతా హిందీ భాషను నేర్చుకోవాలి



భీమవరంలో హిందీభాష దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: విద్యార్థులంతా హిందీభాషను నేర్చుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ వనమా శ్రీకాంత్ అన్నారు. భీమవరం వీరమ్మ పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష రెండవస్థానంలో ఉందని, దాదాపుగా 3,372 భాషలను దేశ ప్రజలు మాట్లాడుతున్నప్పటికీ 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ జాతీయ భాషగా హిందీనే భావిస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ హ్యూమన్‌రైట్స్ ఏపీ చైర్మన్ పర్రిపాటి శ్రీనివాస్, పీఎస్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, శ్రీవిద్య స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీభవానీ, హిందీ పండిత్ వలవల సాయి, సీహెచ్ శైలజ, పి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుని ఆలయ ట్రస్ట్ బోర్డు నియామకం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి (పెద్ద గోపురం) దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకపు ఉత్తర్వులు శుక్రవారం వెలువడ్డాయి. పది మందిని సభ్యులుగా నియమిస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా మీసాల రామచంద్రరావు, ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, నాళం నాగ వెంకట సురేఖ, పినిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి సూర్యనారాయణ, పెన్మత్స శ్రీదేవి, బాసిన అప్పల నాగ సత్యనారాయణ, వాండ్రపు కుమారి, నీలాపు సింహాచలం, నీలాపు మణి సభ్యులుగానూ, అర్చకులు సన్నిధిరాజు రామకృష్ణమూర్తి ఎక్స్ అఫిసియో సభ్యుడిగా నియమితులయ్యారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దుస్థితి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దుస్థితి

కాళ్ల: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద భరితంగా ఉన్నాయి. రక్షణ కవచం లేక చేతికందేలా ఉన్నాయి. అంతేకాకుండా రోడ్డు ఆనుకుని ఉండటంతో ప్రమాదాల సంభవించే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల్లో స్థానికులు భయపడుతున్నారు. అంతేకాకుండా పట్టించుకునే వారు లేకపోవడంతో పిచ్చి పాదులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకొని ఉన్నాయి. దీనివల్ల విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా దీనివల్ల లో వోల్టేజ్ సమస్య, వైర్లు ఎర్త్ అయ్యి విద్యుత్ కోతలు వచ్చే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. మండలంలో మాలవానితిప్ప, ఆనందపురం, ఎల్ ఎన్ పురం, తదితరు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన కిందకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచం ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో రైతులు ప్రయాణికులు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకున్న తీగలను పాదలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆక్వా చెరువులతో తీరని నష్టం



ఆక్వా చెరువుల వల్ల పండని వరి చేలను చూపిస్తున్న కౌలురైతు

ఉండి: దేవదాయ భూములు పండకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నా దేవదాయ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఉప్పులూరుకు చెందిన కౌలు రైతు లబోదిబోమంటున్నాడు. శుక్రవారం కౌలు రైతు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరు గ్రామానికి చెందిన యర్రా రాజేష్ అనే కౌలురైతు గ్రామానికి చెందిన చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన 13.04 ఎకరాల వరిసాగు భూమిని ఈ ఏడాది జూలైలో ఏడాది పరిమిత కాలానికి రూ.4.46 లక్షలకు బహిరంగ వేలంలో పాడుకున్నాడు. తీరా వేలంలో దక్కించుకున్న వరిచేను వద్దకు వెళ్లి చూడగా చెప్పినట్లుగా 13.04 ఎకరాల భూమి అక్కడ లేకపోవడం, చాలా వరకు ఆక్రమణలకు గురికావడంతో దేవదాయ అధికారులకు విషయాన్ని తెలియజేశారు. సదరు దేవాదాయ భూమిలో నుంచి స్థానికంగా ఉన్న ఆక్వా చెరువుల వారు బోదె తవ్వడంతో పాటు పెద్ద రోడ్డును కూడా నిర్మించుకున్నారు. దీంతో చాలా వరకు దేవదాయ పొలం ఆక్రమణకు గురైంది. దీనికి తోడు వర్షాలు పడిన ప్రతి సీజన్‌లోనూ ఆక్వా చెరువుల వ్యర్థాలు పొంగిపోవడంతో అవికాస్త వరిచేలల్లోకి రావడంతో ఈ సీజన్‌లో సుమారు ఏడు ఎకరాల్లో వరిపంట నష్టానికి గురైందని తెలిపారు. ఈ సమాచారాన్ని కూడా దేవదాయ అధికారులకు తెలియజేసినట్లు కౌలు రైతు తెలిపారు. దీనిపై గ్రామ పెద్దల సహకారంతో సర్వే కుడా పెట్టించారని ఈ సర్వేలో ఎకరం భూమి ఆక్రమణలకు గురైనట్లు తేలిందని దీనిపైనా అధికారులకు సమాచారం అందించినా కనీసం పట్టించుకోలేదని కౌలు రైతు వాపోయాడు. ఏడెకరాల్లో పంట నష్టపోయిన తనను ఆదుకోవాలని లేకుంటే తాను తీవ్రంగా నష్టపోతానని ఇది తాను భరించలేనని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి

నరసాపురం రూరల్: విద్యుత్ చార్జీలను మరింత పెంచే స్మార్ట్ మీటర్లను ప్రజలంతా తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మణేశ్వరం గ్రామంలో ఆ పార్టీ సభ్యులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారని అన్నారు. ఇప్పటికే ఇందన సర్దుబాటు చార్జీలు,ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల మేర విద్యుత్ బిల్లులు పెంచారని విమర్శించారు. మళ్లీ స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు మరింత పెంచే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో విద్య, వైద్యం సామాన్య ప్రజలకు కొంతమేరకు అందుబాటులో ఉండేవని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్య,వైద్యం వ్యాపార సరుకులుగా మారిపోయాయన్నారు. శిక్షణా తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

మోడీ గ్రామ రహదారి బురదమయం



బురదమయమైన మోడీ ఆర్అండ్‌బీ రహదారి

కాళ్ల: జారుడు బల్ల మాదిరిగా కలవపూడి నుంచి మోడి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. కాళ్ల మండలం శివారు కలవపూడి నుంచి మోడీ వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీనికి తోడు శుక్రవారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షానికి మోడీ ఆర్ అండ్ బీ రహదారి బురదమయంగా తయారైంది. రోడ్డు పక్కన ఉన్న మట్టి రోడ్డు పైకి రావడంతో రోడ్డు అంతా బురదమయమై వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ జారిపడతామోనని భయం భయంగా వాహనాలను నడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు వాపోతున్నారు. సుమారు 2 కిలో మీటర్ల మేర రహదారి పూర్తిగా పాడైపోయి అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షానికి ఈ విధంగా ఉంటే భారీ వర్షం వస్తే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాహనదారులు శివారు గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: స్థానిక కోర్టు సముదాయంలో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి చెప్పారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేసుల రాజీకి రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భీమవరంలో బీజేపీ సారథ్యం యాత్ర



బీజేపీ ఆధ్వర్యంలో సారథ్యం యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో శుక్రవారం సారథ్యం యాత్ర నిర్వహించారు. యాత్రను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు బీజేపీ జెండాలను చేతబట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. యాత్రలో రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ



మల్లవరంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో మంచి ఆదరణ ఉందని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవ రం వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ ఎన్నిక కార్యక్రమా న్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నా రు. ఈ సందర్భంగా మల్లవరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లవరం గ్రామశాఖ అధ్యక్షుడిగా పులఖండం మాధవరావు, ప్రధాన కార్యదర్శులుగా పీతల రాజు, గోడి వెంకటేశ్వర్లు, సిర్రా రాజు, గూడూరి భరత్‌సింగ్, కార్యదర్శులుగా కొండేటి వెంకట్రావు, గంటా విజయ్, ముమ్మిడి వరపు బైరాజు, గోగులమండ బాసు, కార్యవర్గ సభ్యులుగా బందెల చిట్టిబాబు, కొక్కిరి గెద్ద ఏసు, బూసి చిట్టిబాబు, సిర్రా శ్యాంబాబు, సింధూరపు పెదపండు, కొయ్యే సుదర్శన్, వడ్డి రాజబాబు, బుంగా చిన వెంకట్రావు, జెల్లెళ్ల చిట్టిరాజు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు యూత్ గ్రామ అధ్యక్షులు దీపాటి మూర్తి రాజు, రైతు విభాగం గ్రామ అధ్యక్షులు నల్లిమిల్లి రాజు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు బుంగా రాజేష్, బీసీ సెల్ గ్రామ అధ్యక్షులు గూడూరి సతీష్, మహిళా గ్రామ అధ్యక్షురాలిగా బుంగా కవలమ్మ, మేధావుల ఫోరమ్ అధ్యక్షుడిగా పిల్లి అశోక్‌లు ఎన్నికయ్యారు. వీరందరినీ పార్టీ నాయకులు అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీపీ మైలాబత్తుల సోనీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దొండపాటి వెంకట్, ఒడుగు సత్యనారాయణ, పులపర్తి ప్రతాప్, మైలాబత్తుల శ్రీను, కడలి రాంబాబు, అడ్డాల నర్సింహరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
90108 51166
Office mail : tpgadvt@gmail.com